# సికింద్రాబాద్‌లో పజ్జన్న గెలుపు

- పద్మారావుగౌడ్ హ్యాట్రిక్ విజయం
- కాంగ్రెస్ అభ్యర్థిపై 45,625 ఓట్ల మెజార్టీతో గెలుపు

సికింద్రాబాద్, డిసెంబర్ 3: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. 2014, 2018 ఎన్నికలలో ఘన విజయాన్ని అందుకున్న పద్మారావుగౌడ్‌కు బీఆర్ఎస్ అధిష్ఠానం తిరిగి సికింద్రాబాద్ సీటును తిరిగి కేటాయించింది. గత ఎన్నికల్లో కంటే ఈసారి అత్యధికంగా 45 వేల 625 ఓట్ల మెజార్టీతో ఆయన గెలుపొందారు.

**● రౌండ్ల వారీగా పద్మారావుకు మెజార్టీ**

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఓయూ డీఆర్‌సీ సెంటర్‌లో ఎన్నికల కౌంటింగ్‌లో అధికారులు 14 టేబుళ్లు, 16 రౌండ్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ఆరంభమైన సికింద్రాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండ్ నుంచే పద్మారావుగౌడ్ ఆధిక్యం ప్రదర్శిస్తూ వచ్చారు. మొదటి రౌండ్ నుంచే పద్మారావుగౌడ్ ముందంజలో ఉంటూ వచ్చారు. మొత్తం 16 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. కాగా, మొదటి రౌండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిపై 6వేల212 ఓట్ల లీడ్ ఇవ్వగా సెకండ్ రౌండ్‌లో 5 వేల 228, మూడో రౌండ్‌లో 4వేల131, నాలుగో రౌండ్‌లో 5వేల 204, ఐదో రౌండ్‌లో 5వేల706 ఆధిక్యంలో ఉన్నారు. ఆరో రౌండ్‌లో 5వేల 241, ఏడో రౌండ్‌లో 5వేల 335, ఎనిమిదో రౌండ్‌లో 5వేల551, తొమ్మిదో రౌండ్‌లో 3వేల 890 లీడ్ రాగా ఆ తరువాతి రౌండ్ ముగిసే సరికి 28వేల 660 ఓట్లతో ఆధిక్యంలో ఉన్నారు. తొమ్మిదో రౌండ్‌తో కలిపి పద్మారావుగౌడ్‌కు 46వేల 498 ఓట్లు వచ్చాయి. పదో రౌండ్ ముగిసే సరికి 50వేల 882 ఓట్లు వచ్చాయి. పదకొండో రౌండ్‌లో 55వేల 342 ఓట్లు పద్మారావుగౌడ్‌కు పోల్ అయ్యా యి. 12వ రౌండ్ ముగిసే సరికి పద్మారావుగౌడ్ 36వేల 40 ఓట్ల మెజార్టీతో ముందు వరుసలో ఉన్నారు. 13వ రౌండ్‌లో 39వేల 841 ఓట్లతో లీడ్‌లో ఉండగా 14వ రౌండ్ ముగిసే సరికి 42వేల 444 ఓట్లతో ఆధిక్యంలో ఉన్నారు. 15వ రౌండ్‌లో 41వేల 360 ఆధిక్యంలో ఉన్నారు. చివరగా 16వ రౌండ్‌లో 45వేల 625 మెజార్టీతో ఘన విజయం సాధించారు.

● సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పద్మారావు గౌడ్ గెలుపొందడంతో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి గుండవేణి రాజేష్ గౌడ్(పెద్దన్న) ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సంబురాలు చేసుకున్నారు.



గెలుపు పత్రంతో కౌంటింగ్ కేంద్రం బయట కుటుంబ సభ్యులు,అభిమానులతో పద్మారావుగౌడ్



పద్మారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సికింద్రాబాద్ కార్పొరేటర్లు



హ్యాట్రిక్ విజయం సాధించడంతో ర్యాలీలో అభివాదం చేస్తున్న పద్మారావుగౌడ్



విజయ సంకేతాన్ని చూపిస్తున్న బీఆర్ఎస్ నగర సంయుక్త కార్యదర్శి రాజేష్ గౌడ్, పార్టీశ్రేణులు

**● పార్టీల వారీగా పోలైన ఓట్లు**

సికింద్రాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 2,56,555 ఓటర్లు ఉండగా అందులో మహిళలు 1,30,716, పురుషులు 1,29,144, ఇతరులు 25 మంది ఓటర్లు ఉన్నారు. గత నెల 30న జరిగిన ఎన్నికల్లో మొత్తంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,41,104 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో బీఆర్ఎస్‌కు 77,910, కాంగ్రెస్‌కు 32,598, బీజేపీ పార్టీకి 25,012 ఓట్లు వచ్చాయి. అలాగే, పోస్టల్ బ్యాలెట్లలో బీఆర్ఎస్ 313, కాంగ్రెస్ 305, బీజేపీకి 190 ఓట్లు వచ్చాయి.

# లాస్యనందిత..తొలివిజయం

## రెండోస్థానంలో కాషాయం, మూడో స్థానంలో కాంగ్రెస్

కంటోన్మెంట్, డిసెంబర్ 3: సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గ్యాని లాస్యనందిత మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల కౌంటింగ్‌లో తొలి రౌండ్ నుంచి గులాబీ పార్టీ పూర్తి స్థాయి ఆధిపత్యాన్ని ప్రదర్శించి విజయకేతనం ఎగురవేసింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన గ్యాని లాస్యనందిత తన సమీప ప్రత్యర్థి బీజేపీ) శ్రీ గణేష్‌పై 17,169 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు 59057 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి శ్రీ గణేష్‌కు 41,888 ఓట్లు వచ్చాయి. దీంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో రెండోసారి మహిళను అక్కున చేర్చుకుంది.



ఎమ్మెల్యేగా కూతురు లాస్యనందిత విజయం సాధించడంతో..కుటుంబ సభ్యుల సంబురాలు

● బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గ్యాని లాస్యనందితకు మొత్తం 59,057 ఓట్లు పోలవగా తన సమీప ప్రత్యర్థి శ్రీ గణేష్‌కు 41,888, కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెలకు 20,826 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో మొత్తం 2,48,723 ఓట్లకు గాను కేవలం 1,24,508 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరోవైపు పోస్టల్ ఓట్లలో కాంగ్రెస్‌కు 162, బీఆర్ఎస్‌కు 146, బీజేపీకి 136, చెల్లని ఓట్లు 6 వచ్చాయి.

**● నియోజకవర్గ ప్రజలకు లాస్యనందిత ధన్యవాదాలు**

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మాట్లాడుతూ.. ఈ విజయం కంటోన్మెంట్ ప్రజలకు అంకితమని చెప్పారు. తనకు విజయాన్ని కట్టబెట్టిన కంటోన్మెంట్ ఓటర్లందరికీ శతకోటి వందనాలు తెలిపారు. అలాగే తన విజయం కోసం అహర్నిశలు కృషి చేసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, బోర్డు సభ్యులు, ఉద్యమకారులు, దివంగత ఎమ్మెల్యే సాయన్న అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, ఆలయ కమిటీల సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నేతలు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఎంఎన్ శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు తదితర ముఖ్య నాయకులకు లాస్యనందిత కృతజ్ఞతలు చెప్పారు.



ధృవీకరణ పత్రంతో విజయకేతనం చూపిస్తున్న ఎమ్మెల్యే లాస్యనందిత, గజ్జెల నాగేశ్, ఎంఎన్ శ్రీనివాస్, ముప్పిడి గోపాల్





బేగంపేట కౌంటింగ్ కేంద్రం నుంచి నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో లాస్యనందిత, ఎంఎన్ శ్రీనివాస్, గజ్జెల నాగేశ్‌లు, కార్ఖానాలోని క్యాంపు కార్యాలయం వద్ద..